రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు..
టమాట రూ. 33, వంకాయ రూ. 28, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 53, కాకర రూ. 38, బీర రూ. 35, క్యాబేజి రూ. 20, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28–37, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 40, దోస రూ. 15, సొర రూ. 9, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నియామకం



బత్తుల మల్లేష్‌గౌడ్

వనస్థలిపురం: టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన బత్తుల మల్లేష్‌గౌడ్‌ను నియమిస్తూ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మధుయాష్కీగౌడ్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండగా నిలుస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బీఎన్‌రెడ్డినగర్, సాయిరామ్ కాలనీ చెందిన హన్యశ్రీకి రూ.60 వేలు, మునుగోడు నియోజకవర్గానికి చెందిన లక్ష్మమ్మకు మంజూరైన రూ.16 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు నాగోలుని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు సత్వర న్యాయం జరుగుతోందన్నారు.

వైభవం.. ఘటాల మహోత్సవం

ఘనంగా శ్రద్ధాబాద్ ఘటాల ఊరేగింపు | ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు | అడుగడుగునా హారతులు, ప్రత్యేక పూజలు

సైదాబాద్: శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 46వ మహంకాళి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సైదాబాద్ చౌరస్తాలోని మలక్‌పేట ఏసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఘటాల ఊరేగింపు సైదాబాద్ పుర వీధుల్లో శోభాయమానంగా సాగింది. అడుగడుగునా హారతులిచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించటంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.ఊరేగింపు మార్కెట్ కూడలికి చేరుకున్న తర్వాత సాంప్రదాయబద్ధంగా నిర్వహించే 'గావు' పట్టే కార్యక్రమం పూర్తి చేసారు. అనంతరం తిరిగి మొదలైన ఊరేగింపు సంతోష్‌నగర్ వరకు సాగింది. చివరిగా సైదాబాద్ ధోబీఘాట్‌కు చేరుకున్న ఊరేగింపు అక్కడ అమ్మవారి ఘటాల నిమజ్జనం నిర్వహించటంతో పూర్తయింది.





అలరించిన పోతరాజుల విన్యాసాలు

అలరించిన వేషధారణలు..

అమ్మవారి ఘటాల ఊరేగింపును దేశభక్తి, దైవభక్తి పెంపొందేలా రూపుదిద్దారు. గుర్రాలు, రథాలు, ఒంటెలపై వివిధ దేశభక్తులు, దేవతా రూపాల వేషధారణలు ధరించిన వారితో ఊరేగింపు అలరించింది.రాముడు, ఆంజనేయస్వామి, కృష్ణార్జునులు వంటి దేవతా వేషధారులు, అల్లూరి, భగత్‌సింగ్, శివాజీ వంటి దేశభక్తుల వేషధారులు తమ హావభావాలతో అలరించారు. మరో వాహనంపై ఏర్పాటు చేసిన భక్తి భజన పాటలు, ఆర్కెస్ట్రా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోతురాజుల విన్యాసాలు, కళాబృందాల నృత్యాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఐకమత్యానికి ప్రతీకగా..

గత 46 ఏళ్లుగా శ్రద్ధాబాద్ మహంకాళి జాతర మహోత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని శ్రద్ధాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుభాష్ చందర్జీ పేర్కొన్నారు. అమ్మవారి జాతర వేడుకల్లో ఘటాల ఊరేగింపు ప్రత్యేకం. పాతబస్తీలో అత్యంత ప్రతిష్ఠాత్మకం, వైభవంగా శ్రద్ధాబాద్ ఘటాల ఊరేగింపు సాగుతుందనే స్థానికుల నమ్మకాన్ని ప్రతి యేడు నిలబెడుతున్నాం. శ్రద్ధాబాద్ మహంకాళి జాతర వేడుకలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు.



అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఓల్డ్‌మలక్‌పేటలో..

చాదర్‌ఘాట్: పోతరాజుల విన్యాసాలతో ఓల్డ్‌మలక్‌పేటలో సోమవారం పోచమ్మ దేవాలయం వద్ద ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో చౌకిరవి, బాబు శ్రీనివాస్, చౌకి రాజేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.





ఊరేగింపులో పాల్గొన్న శ్రద్ధాబాద్ అసోషియేషన్ ప్రతినిధులు



దేవతా, దేశభక్తుల వేషధారణలో చిన్నారులు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



ఎంపీ డీకే అరుణకు జ్ఞాపిక అందజేస్తున్న అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్‌లో నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపులో ఆమె చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలకు యువత నృత్యాలు, చిన్నారుల కేరింతలతో అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు కోలాహలంగా సాగింది.ఈ కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి



భవిష్యవాణి చెబుతున్న దేవణమ్మ

సైదాబాద్: ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని భవిష్యవాణిలో దేవణమ్మ తెలిపారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని మల్లికార్జునస్వామి దేవాలయంలో ఉప ఆలయమైన రేణుకా ఎల్లమ్మ మహంకాళి పోచమ్మ అమ్మవార్ల దేవాలయంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో దేవనగర్ దేవణమ్మ భవిష్యవాణి వినిపించారు. తన భక్తులకు ఎలాంటి ఆపద వచ్చినా వాటిని తప్పించి ఆదుకుంటానని అన్నారు. వివాహాలు, సంతానం కోసం పూజలు చేసే వారిని కరుణిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకురాలు అనురాధ, మధుసూధన్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి తొట్టెల ఊరేగింపు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లో సోమవారం అమ్మవారికి తొట్టెలు, ఫలహార బండ్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. డప్పుల చప్పుళ్లు, శివసత్తులు, పోతరాజు విన్యాసాలతో ఆలయ నిర్వాహకులు తొట్టెల ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయినగర్ పోచమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నేత దండెం రాజశేఖర్‌రెడ్డి, బొక్క గోవర్ధన్‌రెడ్డి, గోవుల రాములు పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండి అనిల్‌కుమార్, అమిత్, రాజేష్, రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న అశోక్‌రెడ్డి

హస్తినాపురం: సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎస్‌కేడీనగర్‌లో 15 రోజుల క్రితం సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దృష్టి మరల్చి గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ గ్రామానికి చెందిన ఆమూరి కన్నయ్య(28), గరాడి వంశీ (22), మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ గ్రామానికి చెందిన అంబటి సత్యనారాయణ (23), రంగారెడ్డి జిల్లా అల్మాస్‌గూడ, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన ఎస్.చంద్రమోహన్(20), బండిజశ్వ(23)ను అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

లింగోజిగూడ: ఆటోలను అపహరిస్తున్న దొంగలను రిమాండ్‌కు తరలించిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వివరాల ప్రకారం..సంస్థాన్ నారాయణపురం మండలం కొర్రతండాకు చెందిన కొర్ర కిషన్‌నాయక్ (47) హయత్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయ సమీపంలో నివసిస్తున్నాడు. అదే మండలం మర్రిబావి తండాకు చెందిన సబావత్ లచ్చునాయక్ (35), కంబ్రోతు బాలనాయక్ (29) బంజారాకాలనీలో ఉంటుండగా, సబావత్ కిషన్‌నాయక్ (42) సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముంటున్నాడు. నలుగురు ముఠాగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆటోలను చోరీ చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు నిఘా పెంచారు. చోరీ చేసిన ఆటోలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కిషన్‌నాయక్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. వీరి నుంచి 6 ఆటోలను స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



దత్తవ్రతంలో పాల్గొన్న మహిళలు

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల–రాజు ఆధ్వర్యంలో కొత్తపేటలోనని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అనుగ్రష్టమి అనుఘా దేవి దత్తవ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగ్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులందరూ పాడి పంటలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్న, సంఘం అధ్యక్షులు భిక్షపతి, ఐవీఎఫ్ యూత్ కోశాధికారి నరేష్, సంపత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో హోటల్ తాజ్‌కృష్ణాలో మంగళవారం (నేడు) నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పార్టీల బీసీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీసీ మేధావులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేవీగౌడ్, గోర శ్యాంసుందర్‌గౌడ్, ఓంటెద్దు నరేందర్ వంశరాజ్, శ్యామ్‌యాదవ్, బొంగు వెంకటేష్‌గౌడ్, మారోజు రామాచారి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

మహిళలపై దాడులను నివారించాలి

• మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సృజన



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

నాగోలు: దేశంలో ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలు దాడులు, వేధింపులకు గురవుతున్నారని, మహిళలపై జరుగుతున్న దాడులను వెంటనే నివారించాలని భారత జాతీయ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సృజన అన్నారు. సోమవారం హయత్‌నగర్‌లో నీలమ్మ అధ్యక్షతన జరిగిన రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలంతా సంఘటితంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. సమాజంలో ఉన్న మహిళలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసైన యువత మహిళలపై అత్యాచారాలు, దాడులకు తెగబడుతున్నారని.. మద్యం, గంజాయిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత విద్యా ఉపాధి అవకాశాలు, బాలికలకు కళాశాల స్థాయిలలో ఆత్మ రక్షణ పద్ధతులను నేర్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యలపై మహిళా సమాఖ్య అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షైమిద మాట్లాడుతూ.. మహిళా సమాఖ్యను బలోపేతం చేస్తామని పది మండలాల్లో ఉన్న కమిటీలను 27 మండలాలకు విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పర్వతాలు, శేఖర్‌రెడ్డి, హయత్‌నగర్ మండల సహాయ కార్యదర్శి సెక్రు, ప్రజానాట్యమండలి కార్యదర్శి వేణు శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులుగా కే.అరుణ, ప్రధాన కార్యదర్శి ఎండి షైమిద, వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఉపాధ్యక్షులు లక్ష్మిరెడ్డి, కమల శ్రీదేవి, సహాయ కార్యదర్శులు యాదయ్య, నవనీతతో పాటు 35 మంది కౌన్సిల్, 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నామినేషన్ దాఖలు



మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్‌కుమార్ ఎల్‌బీటీ మార్కెట్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్స్ నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వేముల బాలరాజు, శ్రీనివాసరావు, మల్లయ్య, గంజి శ్రీనివాస్, నవీన్‌కుమార్, పగడిమర్రి హరి, కిషోర్, గోషిక యాదగిరి, సత్యనారాయణ, వివిధ జిల్లాల సంఘం నేతలు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి జాతీయపక్షి

వనస్థలిపురం: జాతీయ పక్షి నెమలి దారితప్పి జనారణ్యంలోకి వచ్చింది. సోమవారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్–2లో ఓ ఇంటి ఆవరణలో చెట్టుపై ఉన్న నెమలిని గుర్తించిన స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ అక్కడికి చేరుకుని నెమలిని చాకచక్యంతో పట్టుకున్నాడు. అనంతరం చింతలకుంట సమీపంలోని రేడియో స్టేషన్ అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.



నేడు డయల్ యువర్ డీఎం

లింగోజిగూడ: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హయత్‌నగర్ డిపో–1లో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఉన్న 9959226138 నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.



కూలేందుకు సిద్ధం.. స్పందించకుంటే ప్రమాదం

అక్బర్‌బాగ్ డివిజన్ పరిధి ప్రొఫెసర్స్ కాలనీలో ఓ భారీ వృక్షం ఓ వైపు ఒరిగి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. వర్షాలకు తడిసి ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పొరపాటున చెట్టు కూలితే సమీపంలోని ఇళ్లు, విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉంది. ఇటీవల పాతబస్తీలో చెట్టు కూలి ఒకరు మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. కాలనీ ప్రధాన దారి కావడంతో నిత్యం వేలల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడే పలు పాఠశాలలు ఉన్నాయని సంబంధిత అధికారులు ప్రమాదం జరగకముందే స్పందించాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు. –మలక్‌పేట



పట్టపగలే వెలుగులు.. పట్టించుకునేదెవరు?

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వీధి దీపాలు నిరంతరం వెలిగి విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్వహణ లోపం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో పట్టపగలూ వెలుగుతున్నాయి. విద్యుత్ దీపాల నిర్వహణ సరిగ్గా లేకపోవడమే ఇందుకు కారణమని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు రాత్రి సమయంలో వెలిగి ఉదయం ఆఫ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. –వనస్థలిపురం

అధికారుల నిర్లక్ష్యం.. మురుగుతో దుర్గంధం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి రోడ్డుపై మురుగు ఏరులై పారుతుండటంతో కాలనీలన్నీ దుర్గంధంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిలుస్తుండటంతో పిచ్చిమొక్కలు పెరిగి పాములకు ఆవాసంగా మారుతుందని భయాందోళనకు గురవుతున్నారు. డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీ, ఆదర్శ్‌నగర్‌కాలనీ, వాంబేకాలనీ, అనుపమానగర్, సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కేవలం చినుకులకే డ్రైనేజీలు పొంగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు. –హస్తినాపురం

